



అవకాశం దక్కేనా?

- నర్సంపేట ఎమ్మెల్యేకు మంత్రి పదవిపై పెరుగుతున్న ఆశలు
- దొంతి కోసం ఉత్తమ్ ప్రయత్నాలు చేస్తున్నట్టు ప్రచారం
- మంత్రివర్గ విస్తరణపై ఆశావహుల్లో ఉత్కంఠ
- కొందరు ఎమ్మెల్యేలకు పార్టీ, కార్పొరేషన్ పదవుల ఆఫర్
- సినీనటి, ఎమ్మెల్సీ విజయశాంతి 'ప్రొటోకాల్' నియోజకవర్గం ఎక్కడ?
- ఆమె చూపు పోరుగడ్డ ఓరుగల్లు వైపా! గతంలో ఎంపీగా గెలిచిన మెదక్ వైపా?
- రాములమ్మకు మంత్రి పదవి దక్కితే.. ఇప్పుడున్న వారిలో చెక్ పడేదెవరికి?
- తాజా సమీకరణలతో ఉత్కంఠగా ఉమ్మడి వరంగల్ రాజకీయం

ప్రస్తుతం అందరి చూపు మంత్రివర్గ విస్తరణ వైపే ఉంది. ముమ్ముందు రాజకీయంగా మారబోతున్న సమీకరణాలేంటి? రేవంత్ కేబినెట్‌లో కొత్తగా చాన్స్ దక్కేదెవరికి? ఉన్నవారిలో ఉద్వాసన పలికేదెవరికి? అన్న చర్చతో ఉమ్మడి జిల్లా రాజకీయం హీటెక్కుతోంది. ఇప్పటికే మంత్రి పదవికి కోసం ఒకరిద్దరు ఎమ్మెల్యేలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో.. మరికొందరు ఎమ్మెల్యేలకు కీలకమైన కార్పొరేషన్ పదవులు లేదంటే రాజకీయంగా తగిన గుర్తింపునిస్తూ పదవులను ఇస్తామని అధిష్ఠానం ఆఫర్ ఇచ్చినట్టు తెలుస్తోంది. మరోవైపు ఎమ్మెల్సీగా ఎన్నికైన సినీనటి విజయశాంతి ప్రొటోకాల్ కోసం ఏ నియోజక వర్గాన్ని ఎంచుకుంటారోనన్న చర్చ కూడా మొదలైంది. ఆమె పోరుగడ్డ ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రాధాన్యమిస్తారా? లేదంటే తనకు గతంలో ఎంపీగా విజయాన్నిచ్చిన మెదక్ వైపు మొగ్గు చూపుతారా అనేది ఉత్కంఠగా మారింది. ఇదిలా ఉంటే మంత్రివర్గంలో విజయశాంతికి బెర్త్ ఖాయమైతే ఇప్పుడుతున్న అమాత్యుల్లో ఎవరికి చెక్ పడుతుందోనన్నది మరింత చర్చకు దారితీస్తోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గాన్ని విస్తరించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఏఐసీసీ నేతలతో సుదీర్ఘంగా చర్చలు జరుపుతున్న ఆయన ఉగాది పండుగకు అటుఇటుగా మంత్రివర్గాన్ని విస్తరిస్తారనే చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో రేవంత్ క్యాబినేట్‌లో మంత్రి పదవి కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇప్పటికే రేవంత్ జట్టులో వరంగల్ తూర్పు, ములుగు ఎమ్మెల్యేలు కొండా సురేఖ, సీతక్కలకు అవకాశం కల్పించారు. ఇద్దరు మహిళా మంత్రుల్లో ఒకరు బీసీ, మరొకరు ఎస్టీ సామాజిక వర్గాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో జనరల్ కోటా నుంచి మరొకరికి అవకాశం ఇవ్వాలని చాలా రోజులుగా సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలు ఒత్తిడి తీసుకొస్తున్నారు.

క్యాబినేట్‌లో బెర్త్ లభించేనా?

మంత్రి పదవుల కోసం పలువురు

మిగతా 7వ పేజీలో...

పలువురికి కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ పదవుల ఆఫర్..

మంత్రివర్గ విస్తరణపై ఆశలు పెట్టుకున్న పలువురు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మినాక్షి నటరాజన్ ఇప్పటికే చర్చలు జరిపారు. పార్టీలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న వారికి పార్టీ పదవులు లేదంటే కార్పొరేషన్ చైర్మన్ల నియామకంలో ప్రాధాన్యమిస్తామని, ఆర్టీసీ చైర్మన్ లాంటి కీలకమైన పదవులు క్యాబినెట్ ర్యాంకుతో ఇస్తామని హామీ ఇచ్చారనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా వరంగల్‌పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించాలని అధిష్ఠానం నిర్ణయించినట్టుగా సమాచారం. నాయినికి ప్రభుత్వంలో కీలక పదవిని కట్టబెట్టేందుకు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించారని, కానీ అందుకు కుల సమీకరణలు కలిసి రాలేదని సమాచారం. నాయినితో పాటు పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావులతో పాటు ఒకరిద్దరికి కీలకమైన పార్టీ పదవులు లేదా కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కుతాయనే చర్చ జరుగుతోంది.

రాములమ్మ ప్రొటోకాల్ ఎక్కడ?



సినీనటి విజయశాంతి ఇటీవలే ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ప్రతీ ఎమ్మెల్సీ తన ప్రొటోకాల్ కోసం ఒక అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. అయితే విజయశాంతి ఏ నియోజకవర్గాన్ని తన ప్రొటోకాల్ కోసం ఎంచుకుంటారనే చర్చ విస్తృతంగా జరుగుతోంది. తన సొంత జిల్లా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం మండలం రామన్నగూడెంగా విజయశాంతి గతంలోనే ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా వరంగల్ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు ప్రయత్నాలు చేశారు. అయితే 2009లో టీఆర్ఎస్ తరఫున మెదక్ నుంచి పోటీ చేసి ఎంపీగా విజయం సాధించారు. 2014లో తెలంగాణ ఏర్పాటులో ఆమె కీలకంగా ఉన్నారు. అయితే 2014లో మెదక్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీగా ప్రొటోకాల్‌ను గతంలో తాను ఓడిపోయిన మెదక్ నియోజవర్గాన్ని ఎంచుకుంటారా? లేక తన సొంత జిల్లాగా చెప్పుకొనే ఉమ్మడి వరంగల్‌లోని ఏదైనా అసెంబ్లీ స్థానాన్ని ఎంపిక చేసుకుంటారా? లేదంటే హైదరాబాద్‌లో ఏదో ఒక సెగ్మెంట్‌తో సరిపెట్టుకుంటారా అనేది చర్చనీయాంశగా మారింది. ఇదిలా ఉంటే విజయశాంతికి మంత్రివర్గ విస్తరణలో చోటు ఖాయమన్న చర్చ జరుగుతోంది. అదే జరిగితే ఓరుగల్లు రాజకీయాల్లో మార్పులు అనివార్యమని, ఇప్పటికే ఇద్దరు మహిళ మంత్రులు ఉమ్మడి వరంగల్ నుంచే ఉండటంతో మూడో మహిళ మంత్రి కూడా వరంగల్ నుంచే ఇస్తారా? లేదంటే ఎవరికైనా ఉద్వాసన పలుకుతారా? అనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో మార్పు ఉండకపోవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా.. సోషల్ మీడియాలో వివిధ రకాలుగా జరుగుతున్న ప్రచారం ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి మంత్రివర్గ విస్తరణతో పాటు ఎమ్మెల్సీ విజయశాంతి ప్రొటోకాల్ నియోజవర్గం ఎంపిక అంశాలు ఓరుగల్లు పాలిటిక్స్‌ను వేడెక్కిస్తున్నాయి.



కురవి శ్రీవీరభద్ర స్వామి హుండీని లెక్కిస్తున్న సేవ ట్రస్టు సభ్యులు

వీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.41.35లక్షలు

కురవి, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయ ఆదాయం హుండీల ద్వారా రూ.41 లక్షల 35 వేల 45లు లభించినట్లు కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ తెలిపారు. మూడునెలలుగా జమ అయిన హుండీల ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. వీరభద్రస్వామి హుండీద్వారా రూ.31 లక్షల 37 వేల 667లు, భద్రకాళి అమ్మవారి హుండీ ద్వారా రూ.9 లక్షల 97 వేల 378లు లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకులుగా ఎండోమెంట్ అధికారి ఆర్.సమత వ్యవహరించారు. దేవాలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, చక్రునాయక్, కె.ఉప్పలయ్య, దొంగల జనార్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, సంజీవరెడ్డి పాల్గొన్నారు. లక్ష్మి శ్రీనివాస, ఉమాశంకర్ సేవా ట్రస్టు మణుగూరులకు చెందిన 280 మంది మహిళలు లెక్కింపులో పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు

నర్సింహులపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో పెట్టుకొని నిరంతర కరెంట్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్ చీఫ్ ఇంజనీర్ కె.రాజుచౌహన్ అన్నారు. పెద్దనాగారం 132బై33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. విద్యుత్ సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవర్‌లోడ్ ఉన్న ఫీడర్లకు అదనపు 33 కేవీ ఫీడర్లను బదిలీ చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు ఓవర్‌లోడ్ ఉంటే తక్షణమే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లను మంజూరు చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ మధుసూదన్, ఏఈ పాండునాయక్, సిబ్బంది ఉన్నారు.

మానుకోట బార్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

మహబూబాబాద్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికల కోసం మంగళవారం నామినేషన్లను స్వీకరించినట్లు ఎన్నికల అధికారి గాదె కమలాకర్ తెలిపారు. కమలాకర్ తెలిపిన వివరాలప్రకారం.. మహబూబాబాద్ కోర్టులో 81 మంది న్యాయవాదులు విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈనెల 28న ఓటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, సహాయ కార్యదర్శి, స్పోర్ట్స్, లైబ్రేరి, ఈసీ మెంబర్ల కోసం 19 మంది నామినేషన్‌లు వచ్చినట్లు తెలిపారు. బుధవారం విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. విత్‌డ్రా అనంతరం బరిలో ఉన్న అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామన్నారు.

హలధారి ఆగమాగం

కాంటాలు కావడం లేదని రైతుల ఆందోళన

మానుకోటలో చినుకులు రావడంతో గందరగోళం

- మార్కెట్‌లో టార్పాలిన్ల కోసం ఎగబడ్డ అన్నదాతలు
- పోలీసులు రాకతో పరిస్థితి అదుపులోకి..



మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో కార్యదర్శితో రైతుల వాగ్వావాదం



ఆందోళన చేస్తున్న రైతులను శాంతింపజేస్తున్న సీఐ దేవేందర్

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో భారీగా మిర్చి రాబడులు కొనసాగుతున్నాయి. పంటకు కాంటాలు ఆలస్యమవుతుండడం, విన్నర్ లిస్టునూ మధ్యాహ్నంకు బదులుగా, సాయంత్రం ప్రకటిస్తామని చెప్పడంతోనూ, వాతావరణంలో మార్పులు జరిగి చిన్నపాటి చినుకులు కురియడంతో రైతులు ఆందోళనకు దిగారు. టార్పాలిన్‌ల కోసం మూకుమ్మడిగా రైతులు కార్యాలయం దగ్గరకు రావడంతో తీవ్ర గందరగోళానికి దారితీయడంతో పట్టణ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై విజయ్‌కుమార్ తమ బలగాలతో మార్కెట్ యార్డుకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటన మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.

28 వరకు సరుకు మార్కెట్‌కు తీసుకురావొద్దు..

మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు 15 వేలకు పైగా మిర్చిబస్తాల రాబడులు కొనసాగుతున్నాయి. దీంతో ప్రతీరోజు ఈనామ్ మార్కెట్‌లో వేలం పాటలు జరుగుతున్నాయి. ఆ సరుకుకు రెండు నుంచి మూడ్రోజులు సమయం పడుతుంది. మంగళవారం ఉదయం మార్కెట్‌లో 15 వేలకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయని, బిడ్డింగ్, కాంటాలు అయ్యేందుకు మరో రెండ్రోజులు సమయం పట్టే అవకాశం ఉందని, దాంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మార్కెట్ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 26 నుంచి 28 వరకు మార్కెట్ యార్డులోకి మిర్చి బస్తాలను తీసుకురావొద్దని, మిర్చిని మార్కెట్ యార్డులోకి అనుమతించబోమని మార్కెట్ అధికారలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రోజు 6వేల నుంచి 7వేల బస్తాల వరకు మిర్చికి వేలం పాటలు నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటలకు విన్నర్ లిస్టును ప్రకటిస్తున్నారు. ఆతర్వాత కాంటాలునిర్వహిస్తున్నారు. అయితే మంగళవారం మాత్రం అలా చేయకుండా మార్కెట్ అధికారులు9,600 బస్తాలకు టోకెన్‌లు ఇచ్చి మధ్యాహ్నం విన్నర్ లిస్టును ప్రకటించకుండా సాయంత్రం 5 గంటలకు విన్నర్‌లిస్టును (ధరల ప్రకటన) ప్రకటిస్తామని చెప్పారు. అయితే 4 గంటల సమయంలో అకాశంలో మబ్బులు చేసి చినుకులు పడడంతో ఓపెన్ యార్డులో ఉన్న మిర్చి రైతులు తీవ్ర ఆందోళనకు గురై మార్కెట్ కార్యాలయానికి మూకుమ్మడిగా చేరుకుని ఆందోళనకు దిగారు.

వ్యాపారులు కాంటాలు పెట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, తమ వ్యాపారసంస్థల వద్ద కాంటాలు నిర్వహించుకుంటూ మార్కెట్ యార్డులో కాంటాలు పెట్టడంలేదని, దాంతోనే మార్కెట్ యార్డులో మిర్చి బస్తాలు పేరుకుపోతున్నాయని రైతులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. టార్పాలిన్‌లు కావాలంటూ రైతులు అధికారులపై ఒత్తిడి తేవడంతో టార్పాలిన్‌లు ఇచ్చేందుకు గోదాం తెరవడంతో రైతులు ఒక్కసారిగా గోదాంలోకి చొచ్చుకుపోయి టార్పాలిన్‌లను తీసుకుని తమ మిర్చిబస్తాలపై కప్పుకున్నారు. రైతులు ఆందోళన చేస్తున్న సమయంలో ఈ విషయం తెలిసిన మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్, ఎస్సై విజయ్‌కుమార్ తమ సిబ్బందితో మార్కెట్‌కు చేరుకుని పరిస్థితి అదుపులోకి తెచ్చారు. దాంతో మార్కెట్‌యార్డులో ప్రశాంతమైన వాతావరణం ఏర్పడింది. కాగా, ప్రతీరోజు 6 వేల నుంచి 7 వేల బస్తాలు మధ్యాహ్నం వరకే వేలం పాటలు నిర్వహించి కాంటాలు పెడితే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.



కిష్టాపురంలో కురుస్తున్న వాన

గార్లలో భారీ వర్షం

గార్ల, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముల్కనూరు, కిష్టాపురం, గార్లతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం భారీగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లో మిర్చికల్లాలు తడిసిపోయాయి. మామిడి తోటల్లో కాయలు రాలిపోవడంతో.. రైతులు ఆందోళనకు గురయ్యారు. అకాల వర్షంతో నష్టపోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

పోలీస్ సర్కిల్‌గా కేసముద్రం?

- మూడు మండలాలు కలిపి 'వలయం'
- పాత పోలీస్‌స్టేషన్ స్థలంలో ఔట్‌పోస్ట్‌కు సన్నాహాలు



కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో పాత పోలీస్‌స్టేషన్ స్థలాన్ని చదును చేస్తున్న యంత్రం



కేసముద్రం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పోలీస్‌స్టేషన్ స్థాయి పెంపునకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవలె కేసముద్రం మండలకేంద్రాన్ని ఐదు గ్రామపంచాయతీలతో మునిసిపాలిటీగా ఏర్పాటు చేసిన విషయం విధితమే. నూతనంగా పాలిటెక్నిక్ గురుకుల కళాశాల ఏర్పాటు, ఒక 132 కేవీ విద్యుత్ స్టేషన్, కేసముద్రం, ఉప్పరపల్లిల్లో 33 కేవీ సబ్ స్టేషన్లు, రూ.45 కోట్లతో సెంట్రల్ లైటింగ్‌తో కూడిన రెండు మార్గాల్లో రోడ్ల విస్తరణ, కేసముద్రం-అర్పనపల్లి ఫోర్‌లైన్ రోడ్డు ఇలా సుమారు రూ.200 కోట్ల అభివృద్ధి పనులు ఈ ప్రాంతంలోనే జరగనున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో కేసముద్రం కేంద్రంగా ఊహించని రీతిలో అభివృద్ధి జరగబోతున్నట్లు స్పష్టమవుతోంది.

మరోవైపు కేసముద్రం మండలం నుంచి కొత్తగా ఇనుగుర్తి మండలం ఏర్పాటు చేశారు. దీంతో ఇనుగుర్తిలో కొత్తగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు పాలకుల విజ్ఞప్తుల మేరకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. ఈ క్రమంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలోను ఈ ప్రాంతంలో పోలీస్ శాఖను ఉన్నతీకరించాల్సిన అవసరం ఏర్పడుతోంది.

సర్కిల్ ఏర్పాటుకు అర్హత..

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో లక్ష నుంచి 1.2 లక్షలకుపైగా జనాభాతో రెండు నుంచి నాలుగు పోలీస్‌స్టేషన్లను కలిపి ఒక పోలీస్ సర్కిల్ ఏర్పాటు చేస్తారు. కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు మండలాల జనాభా 2011 జనాభా లెక్కల ప్రకారం 1.33 లక్షలు ఉండగా వృద్ధిరేటు ఆధారంగా 2025 నాటికి 1.6 లక్షలపైగా ఉన్నట్లు అంచనా. ఈ నేపథ్యంలో కేసముద్రం కేంద్రంగా కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు మండలాలతో పోలీస్ సర్కిల్ ఏర్పాటు చేసేందుకు

మిగతా 8వ పేజీలో...

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- మొక్కజొన్న రైతులను ఆదుకుంటాం
- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి
- నష్టపోయిన రైతులు, అధికారులు, కంపెనీ ప్రతినిధులతో సమీక్ష

ములుగు కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. మొక్కజొన్న పంట సాగుచేసి నష్టపోయిన గిరిజన రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని, ఎవరూ అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో 2,168 ఎకరాల్లో మొక్కజొన్న విత్తన పంటను సాగుచేసిన 959 మంది రైతులు సరైన దిగుబడి రాకపోవడంతో నష్టపోయారు. మూడు ప్రైవేటు కంపెనీలతో ఒప్పందంలో భాగంగా మొక్కజొన్నను సాగుచేయగా పరిహారం చెల్లింపు విషయం తేలకపోవడం, మధుకృష్ణ అనే రైతు ఆత్మహత్య చేసుకోవడంతో వ్యవసాయ కమిషన్ స్పందించింది. చైర్మన్ కోదండరెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేష్‌రెడ్డి, సభ్యులు రాములు నాయక్, గంగాధర్, నరసింహారెడ్డి, వెంకన్నయాదవ్ మంగళవారం


సమావేశంలో వ్యవసాయ కమిషన్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్లు, సభ్యులు, అధికారులు

ములుగుకు వచ్చారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, రైతులు, విత్తన కంపెనీల ఆర్గనైజర్లతో సమీక్ష జరిపారు. మంత్రులు ధనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపామని, మొక్కజొన్న కంకులు, ఆకులను సేకరించి డీఎన్ఏ ఫింగర్‌ప్రింట్ ల్యాబ్‌కు పంపామని జిల్లా వ్యవసాయాధికారి సురేష్ తెలిపారు. రైతులు, విత్తన కంపెనీల ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించగా నష్టపరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమచేసేలా ప్రాథమిక అంగీకారం కూడా కుదిరిందని వెల్లడించారు. అయితే కొందరు ఆర్గనైజర్లు రైతులకు అనధికారికంగా అప్పులు ఇచ్చి అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారని, వారిపై మనీ లెండింగ్ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, ఆర్గనైజర్ల నుంచి రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. స్పందించిన వ్యవసాయ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ ఈ అంశంపై అధికారుల సమగ్రమైన నివేదికను సమర్పించారని, ఏజెన్సీ ప్రాంత రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అన్నారు. ఆ సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, అదనపు కలెక్టర్‌లు సీహెచ్.మహేందర్‌జీ, సంపత్‌రావు, వ్యవసాయ కమిషన్ అడ్వైజర్లు దొంతి నరసింహారెడ్డి, రామాంజనేయులు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సుచరిత, ఆర్డీవో వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఎల్ఆర్ఎస్‌పై అధికారులకు సూచనలిస్తున్న లెనిన్ వత్సల్ టొప్పో

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

మానుకోట అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

తొర్రూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్‌తో ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, ప్రక్రియను అధికారులు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. మంగళవారం తొర్రూరు మునిసిపాలిటీలో సిబ్బంది చేపడుతున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఫీజు చెల్లించిన లబ్ధిదారులకు వెంటనే ప్రొసీడింగ్ కాపీ అందించాలని ఆదేశించారు. సోషల్ వెల్ఫేర్ పాఠశాల, జూనియర్ కళాశాల వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న మెనూ పరిశీలించారు. వార్డెన్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి గ్రామాల్లో చేపడుతున్న ఎల్ఆర్ ఎస్ ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. 100శాతం ఆస్తి పన్నులు, నల్లాపన్నులు వసూలు చేయాలని, పంచాయతీలు, మునిసిపాలిటీల అభివృద్ధికి కృషిచేయాలని కోరారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, మునిసిపాలిటీ పరిధిలో త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్, ఎంపీడీవో పూర్ణచందర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ భషీర్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

తొర్రూరు రూరల్ (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ పథకం చెల్లింపులు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. మండలంలోని వెల్లికట్టె గ్రామ పంచాయతీని పరిశీలించి మాట్లాడారు. మండలంలోని 17 గ్రామాల్లో సుమారు 3589 దరఖాస్తు ఉండగా చెల్లింపులు పూర్తి స్థాయిలో త్వరితగతిన చెల్లించేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వెల్లికట్టె గ్రామంలోనే 2213 దరఖాస్తులు వచ్చాయని ఎంతమేరకు చెల్లింపులు చేశారని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో పూర్ణచందర్, ఆర్ఐ బషీర్, వినయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు ప్రభ, లెనిన్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

విత్తన కంపెనీల ఏజెంట్లపై కేసు నమోదు

ములుగు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న విత్తన కంపెనీలకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్న ఇద్దరిపై ఏటూరునాగారం సబ్‌డివిజన్ పోలీసులు మంగళవారం కేసులు నమోదు చేశారు. వెంకటాపురం మండలం యోగితా నగర్‌కు చెందిన పాయం రాంబాబు తనకు చెందిన నాలుగెకరాల్లో హైటెక్ కంపెనీకి చెందిన విత్తనాలను సాగుచేయగా దిగుబడి రాకపోవడంతో రూ.5 లక్షల నష్టం వాటిల్లింది. మన్యం సురేష్ అనే ఏజెంటు తనను నమ్మబలికి మక్క విత్తనాలు అంటగట్టాడని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదే క్రమంలో వాజేడు మండలం పూసూరుకు చెందిన జాడి రాంబాబు తన తొమ్మిదెకరాల భూమిలో బేయర్ కంపెనీ వితనాలు సాగుచేయగా రూ.7లక్షల వరకు నష్టం వాటిల్లింది. మంగపేట మండలం తిమ్మంపేటకు చెందిన చిలకమారి వేణు అనే ఏజెంట్‌పై అతడు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ఇద్దరు ఏజెంట్లపై కేసు నమోదు చేశామని, దీనిపై లోతైన దర్యాప్తు చేస్తున్నామని ఏటూరునాగారం ఏఎస్పీ శివమ్ ఉపాధ్యాయ తెలిపారు. విత్తన కంపెనీ దళారులు వేణు, సురేష్‌పై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు సీనియర్ క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి ఓలేటి జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్రక్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మే 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న క్రీడాశిక్షణ శిబిరాలకు 14 సంవత్సరాల లోపు బాలబాలికలు అర్హులన్నారు. అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులతో ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ శిబిరాలకు తల్లిదండ్రులు పిల్లలను పంపించాలని కోరారు.

కూలికి వెళ్లి.. మృత్యు ఒడిలోకి..

- అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లిన లారీ
- పత్తి విత్తన బస్తాలు పడి ఇద్దరు మహిళల దుర్మరణం
- భూపాలపల్లి జిల్లా రామకిష్టాపూర్ (టీ)లో ప్రమాదం


పొలంలోకి దూసు కొచ్చిన లారీ

టేకుమట్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లారీ అదుపు తప్పి పొలంలోకి దూసుకురావడంతో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకిష్టాపూర్ (టీ) గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... రామకిష్టాపూర్ (టి)కు చెందిన మోకిడి సంధ్య (28), మోకిడి పూలమ్మ (45) గ్రామ శివారులోని వరి పొలంలో బెరుకులు ఏరడానికి ఎనిమిది మంది కూలీలతో కలిసివెళ్లారు. పొలం పనికి వీరంతా ఉపక్రమిస్తుండగా పక్కనే ఉన్న మలుపు వద్ద లారీ అదుపు తప్పి దూసుకొచ్చి బోల్తా పడింది. అందులోని పత్తి విత్తన బస్తాలు ఒక్కసారిగా సంధ్య, పూలమ్మపై పడటంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు క్రేన్, జేసీబీ సహాయంతో బస్తాలను తొలగించి ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల ఆస్పత్రికి తరలించారు. మృతులు సంధ్య, పూలమ్మ బంధువులవుతారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాలు వీరివి. రామకిష్టపూర్ (టి)కి చెందిన పూలమ్మ భర్త కిషన్ టేకుమట్లలోని ఓ ఫంక్షన్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా మెకు కూడా కొన్ని రోజులుగా అక్కడే నివాసం ఉంటోంది. రామకిష్టాపూర్ (టి) శివారు వరి పొలంలో బెరుకులు ఏరేందుకు పని ఉందని తెలిసి ఆమె అక్కడి నుంచి వచ్చి ప్రమాదానికి గురై మృతి చెందింది. మృతురాలికి కొడుకు, కూతురు ఉన్నారు. రామకిష్టాపూర్ (టి) గ్రామానికే చెందిన సంధ్య, ఆమె భర్త రాజు రోజు వారీ కూలి పనులకు వెళ్తుంటారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త తాపీ మేస్త్రీ చేతి కింద పనికి వెళ్లగా సంధ్య వ్యవసాయ పనులకు వెళ్లి మృత్యువు బారిన పడింది. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు ప్రమాదానికి గురై మృతి చెందడంతో రామకిష్టాపూర్ (టి)లో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతులిద్దరు బంధువులు కావడంతో ఇరు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి.


పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు ప్రేమ్‌కుమార్, సిబ్బంది

430 క్వింటాళ్ల

పీడీఎస్ బియ్యం స్వాధీనం

నెల్లికుదురు(మహబూబాబాద్ జిల్లా), మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలేరులోని శ్రీరాజరాజేశ్వరి రైస్‌మిల్లు వద్ద అక్రమంగా తరలిస్తున్న 430 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం రాత్రి సివిల్‌సప్లై అధికారులు పట్టుకున్నారు. సివిల్‌సప్లై జిల్లా అధికారి ప్రేమ్‌కుమార్ కథనం ప్రకారం. రేషన్ లబ్ధిదారుల నుంచి పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి క్లీన్‌పాలిష్ చేసి వరంగల్‌లోని సాయిలక్ష్మీ రైస్‌మిల్లు ద్వారా అమ్మకాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ బియ్యాన్ని, లారీని సీజ్‌చేసి మిల్లు మేనేజర్ గోవర్దన్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ సత్యనారాయణ, శ్రీకాంత్, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు

స్వావలంబన సాధించాలి

నాబార్డ్ డీడీఎం రవికుమార్

కాటారం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకుని మహిళలు స్వావలంబన సాధించాలని వరంగల్, భూపాలపల్లి, ములుగు జిల్లాల నాబార్డ్ డీడీఎం రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో నాబార్డ్ సహకారంతో అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ఇండియా (ఏఎల్ఈఐ) ఆధ్వర్యంలో గత ఏడాది ప్రారంభించిన జూట్ బ్యాగుల తయారీలో ఉచితంగా మూడు బ్యాచుల్లో శిక్షణ పొందిన 90మంది మహిళలకు మంగళవారం సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాబార్డు డీడీఎం హాజరయ్యారు. ప్రభుత్వంతోపాటు ఎంటర్‌ప్రెన్యూర్ శిక్షణ సంస్థలు అందిస్తున్న ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం ద్వారా నాబార్డ్ ఎన్నో స్వయం ఉపాధి పథకాలకు రుణాలి స్తోందన్నారు. శిక్షణ పొందిన మహిళలు నాణ్యమైన బ్యాగులను తయారుచేసి మార్కెటింగ్ మెళకువలతో రాణిం చాలన్నారు. మహిళలు జ్యూట్ బ్యాగులే కాకుండా ఆసక్తి కలిగిన రంగంలో నైపుణ్యాలు పెంచుకుంటే సొంతంగా యూనిట్లు ఏర్పాట్లు చేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. భారీ మిషన్ల కోసం బ్యాంకుల ద్వారా రుణాలిప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ భరత్‌రెడ్డి, శిక్షణా కేంద్రం ఇన్‌చార్జి సూర్యదేవర వనిత, శిక్షకురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.


జరిమానా విధిస్తున్న ఎక్సైజ్ అధికారులు

బైండోవర్ ఉల్లంఘించిన

వ్యక్తికి జరిమానా

తొర్రూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గుడుంబా దాడుల్లో పట్టుబడిన వ్యక్తులను తహసీల్దార్ ముందు బైండోవర్ చేయగా వారు బైండోవర్ ఉల్లంఘన చేయడంతో వారికి జరిమానా విధించినట్లు తొర్రూరు ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ ఆర్. ప్రవీణ్ తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గుడుంబా నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ చేస్తున్న నేపథ్యంలో సారా విక్రయిస్తూ పట్టుబడిన తొర్రూరుకు చెందిన బొమ్మనబోయిన వెంకన్న, ధరావత్ యాకూబ్, ధరావత్ శ్రీను ముగ్గురు బైండోవర్ ఉల్లంఘనకు పాల్పడటంతో వారికి రూ.90 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై రవళి, శంకర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

రెండు చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

ములుగు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా కేంద్రం శివారు గట్టమ్మ దేవాలయంతో పాటు మల్లంపల్లిలోని ఓ మద్యం దుకాణంలో చోరీకి పాల్పడ్డ ముగ్గురిని ములుగు పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈనెల 15న రాత్రి 8గంటల సమయంలో గట్టమ్మ ఆలయంలో రూ.57వేల విలువైన వెండి పూజా సామగ్రి చోరీకి గురైంది. ఈ సంఘటనపై ఆలయ పూజారి కొత్త సదయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. 21వ తేదీ రాత్రి మల్లంపల్లిలోని మహంకాళి వైన్స్‌లో దొంగతనం జరగ్గా రూ. 24 వేల నగదు అపహరణకు గురైంది. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా విచారణ జరపగా సూర్యాపేటకు చెందిన ముంజల విష్ణు, కోడి నాగమణి మేడారం వనదేవతల దర్శనానికి వెళ్లి వస్తున్న క్రమంలో గట్టమ్మ ఆలయంలో చోరీకి పాల్పడ్డట్లు గుర్తించారు. అదేవిధంగా మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన చింతకింది సతీష్ మద్యం దుకాణంలో దొంగతనానికి పాల్పడ్డట్లు తేల్చారు. ఈ ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై వెంకటేశ్వర్ రావు తెలిపారు. సొత్తును రికవరీ చేసినట్లు తెలిపారు.


చోరీ కేసు నిందితుల అరెస్టు చూపిస్తున్న పోలీసులు


వీసీ శ్రీనివాస్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏపీ వీసీ కట్టిమణి

ఏపీలో.. ట్రైబల్ వర్సిటీ వీసీ పర్యటన

- విజయనగరంలోని గిరిజన విశ్వవిద్యాలయం సందర్శన
- అక్కడ అమలవుతున్న కోర్సుల పరిశీలన

ములుగు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరంలో ఉన్న జాతీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ వైఎల్. శ్రీనివాస్, ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డి మంగళవారం సందర్శించారు. ఆ వర్సిటీ వీసీ కె.టి.కట్టిమణి, బోధన సిబ్బందితో సమావేశమయ్యారు. వర్సిటీలో అమలు చేస్తున్న కోర్సులు, గిరిజనుల స్థితిగతులపై జరుగుతున్న పరిశోధనలను తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కాగా వర్సిటీ నిర్వహణ, యాక్షన్ ప్లాన్, త్వరలో నిర్మాణమయ్యే ట్రైబల్ మ్యూజియం అంశాలను తెలుసుకున్నారు. సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకో వడంతోపాటు రెండు వర్సిటీల నిర్వహణపై కలిసి వెళ్లేలా ఇరువురు వీసీలు చర్చించుకున్నారు. తమ వర్సిటీని సందర్శించినందుకు వీసీ శ్రీనివాస్, ఓఎస్డీ వంశీకృష్ణారెడ్డిని అక్కడి వీసీ కట్టిమణి శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు.

ఆటో బోల్తా

ముగ్గురికి తీవ్రగాయాలు



వెంకటగిరి రోడ్డులో ఆటో బోల్తా పడడంతో గాయపడిన మహిళలు

కేసముద్రం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం నుంచి వెంకటగిరికి వెళుతున్న ఆటో మంగళవారం సాయంత్రం బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇనుగుర్తి మండలం కోమటిపల్లిలో ఓ కార్యక్రమానికి హాజరై ఆటోలో వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్దకోర్పోలుకు తిరుగు ప్రయాణం కాగా మార్గమధ్యంలో ఆటో రోడ్డుపై పల్టీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పెద్దకోర్పోలుకు చెందిన మట్టె మరియమ్మ, బిర్రు సుగుణ, బిర్రు మేఘన తీవ్రంగా గాయపడ్డారు. ఘటన స్థలానికి ఎస్ఐ మురళీధర్‌రాజ్ చేరుకొని 108 లో క్షతగాత్రులను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి పంపించారు. ఫిర్యాదును స్వీకరించి విచారించనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో హెల్పర్‌కు గాయాలు

ములుగు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మల్లంపల్లి మండలం చంద్రుతండాకు చెందిన విద్యుత్ శాఖలో ప్రైవేటు హెల్పర్‌గా పని చేస్తున్న బానోత్ యాకూబ్ మంగళవారం విద్యుదాఘాతానికి గురయ్యాడు. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫీజులు వేసే క్రమంలో 11కేవీ తీగలు తగలడంతో షాక్‌కు గురైన అతడు స్తంభం పై నుంచి కిందపడ్డాడు. దీంతో మెడ, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం యాకూబ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

మద్యానికి బానిసై ఒకరి మృతి


మృతి చెందిన యాకయ్య

తొర్రూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై ఒకరు మృతి చెందగా మరొకరు ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం తొర్రూరు మండలం సోమారపుకుంట తండాలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. తొర్రూరు మండలం చీకటాయపాలెం గ్రామానికి చెందిన పాం డవుల యాకయ్య (33) కామెర్లతో బాధపడుతుండగా బ్రాహ్మణకొత్తపల్లి గ్రామానికి చెందిన అక్క లలిత నాటు వైద్యం తాపించడానికి తీసుకెళ్లింది. ఈ క్రమంలో మద్యం తాగవద్దని చెప్పడంతో మద్యం తాగకుండా రెండు రోజులు నుంచి అక్క కట్టడి చేసింది. మద్యం తాగకుండా చేస్తుండగా మంగళవారం ఉదయం ఇంట్లో చెప్పకుండా నడుచుకుండా వచ్చాడు. మార్గమధ్యలో సోమారపుకుంట శివారులోని ఖాళీ ప్రదేశంలో చెట్టు కింద కూర్చున వ్యక్తి విగత జీవిగా పడి ఉండటం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. గత ఐదేళ్ల క్రితమే భార్య అనూష నిత్యం మద్యం తాగుతుండడంతో వదిలేసి వెళ్లినట్లు సమాచారం. మృతుడికి కూతు రు సాత్విక, కుమారుడు సాయిసిద్దార్థ్ ఉన్నారు. తల్లి సోలమ్మ ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

వంతడుపల గ్రామంలో ఒకరి ఆత్మహత్య..


శ్రీను (ఫైల్)

నర్సింహులపేట (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై మానసిక వేదనతో ఉరివేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సింహులపేట మండలం వంతడుపల గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై మాలోతు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వం తడుపల గ్రామానికి చెందిన ఏర్పుల శ్రీను (32) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడని, కరోనా లాన్‌డౌన్ నుంచి ఆటో అమ్మి కూలి పనులు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో మద్యానికి బానిసై మతిస్థిమితం కోల్పోయినట్లు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నట్లు తెలిపారు. భార్య మహేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7045	5800
మక్కలు	2129	2100
కందులు	6825	5540
పెసళ్లు	7422	4645
పల్లికాయ (సూక)	6000	6500
పల్లికాయ (పచ్చిది)	4300	3400
తేజ మిర్చి	12700	9000
వండర్ హాట్	14000	11500
యూఎస్ 341	12300	9500
దీపిక	13300	15245
దేశీ	28000	25500
సింగిల్ పట్టీ	27000	24000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్

మరిపెడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికి అప్పుడు ఎండగట్టాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ బీఎస్పీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మరిపెడ మున్సిపాలిటీలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం బాషిపంగ మహేందర్ అధ్యక్షతన నిర్వహించిన మండల, జిల్లా స్థాయి ముఖ్యనేతల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బహుజనుల రాజ్యాధికారం కోసం బీఎస్పీ రాజీలేని పోరాటాలు చేస్తుందని గుర్తు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు 56శాతం ఉండగా తప్పుడు లెక్కలు చెబుతున్నారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని డిమాండ్ చేశారు. ఊరూరా బీఎస్పీని బలోపేతం చేసి స్థానిక ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు దార్ల శివరాజ్, విజయ కాంత్, అభినాయక్, ఈసంపల్లి ఉపేందర్, ఎడ్ల శ్రీను, తగరం నాగన్న, నగేశ్, సువార్త, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంద ప్రభాకర్



మంటలు అర్పుతున్న సిబ్బంది

జిల్లాల వారీగా ఫైర్ సిబ్బంది

- వరంగల్ జిల్లాలో ముగ్గురు ఫైర్ ఆఫీసర్లు, లీడింగ్ ఫైర్ మెన్లు 8మంది, డ్రైవర్ ఆపరేటర్లు 10 మంది, ఫైర్‌మెన్లు 27 మంది, హోంగార్డులు 23 మంది. ఆరుగురు డ్రైవర్లున్నారు.
- హనుమకొండ జిల్లాల్లో ఇద్దరు స్టేషన్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, 15మంది లీడింగ్ ఫైర్ మెన్‌లు, నలుగురు డ్రైవర్ ఆపరేటర్లు, ఐదుగురు ఫైర్ హోంగార్డులు, 18మంది ఫైర్‌మెన్‌లు, ఒక డ్రైవర్ విధులు నిర్వర్తిస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లా పరిధిలో ఇద్దరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు ఉండగా.. నలుగురు లీడింగ్ ఫైర్ మెన్లు, ఐదుగురు ఫైర్ మెన్‌లు, 12మంది హోంగార్డులు, ఇద్దరు డ్రైవర్లు పనిచేస్తున్నారు.
- జనగామ జిల్లాలో ముగ్గురు స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు, ఒక లీడింగ్ ఫైర్ ఆఫీసర్, ఇద్దరు లీడింగ్ ఫైర్‌మెన్లు, ఒక డ్రైవర్ ఆపరేటర్, తొమ్మిది మంది ఫైర్ మెన్లు, ఇద్దరు డ్రైవర్లు విధుల్లో ఉన్నారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు లీడింగ్ ఫైర్ మెన్‌లు, ఒక డ్రైవర్ ఆపరేటర్, తొమ్మిది మంది ఫైర్ మెన్లు, ఇద్దరు డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్నారు.
- ములుగు జిల్లాకు సంబంధించి ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్, ఇద్దరు లీడింగ్ ఫైర్ మెన్లుగా, ఒక డ్రైవర్ ఆపరేటర్, ఒక హోంగార్డు, ఒక డ్రైవర్ పని చేస్తున్నారు.

అగ్నితో రణం..



ఫైర్ సిబ్బంది

భరోసా లేక భయం..

ఎదుగూ.. బొదుగూ లేని 'అగ్నిమాపక' కొలువు

- సమస్యలతో సతమతమవుతున్న ఫైర్ సిబ్బంది
- ఆరోగ్య భద్రత, పదోన్నతులు లేక ఫైటర్స్ ఆందోళన
- అలవెన్స్, ఎక్స్‌గ్రేషియా సదుపాయం కల్పించాలని డిమాండ్

మట్టెవాడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే గుర్తుకొచ్చేది అగ్ని మాపక సిబ్బంది. 101 నెంబరుకు డయల్ చేస్తే ఏ క్షణమైనా అగ్నిమాపక యంత్రంతో ప్రజలకు చెంతకు చేరి సేవలందిస్తారు. ప్రమాద సమాచారం తెలియగానే ఫైర్ ఇంజన్‌తో ఘటనా స్థలికి చేరుకుని తమప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలను, ఆస్తులను కాపాడుతుంటారు. నిత్యం.. నిప్పుతో పోరాడుతారు. అలాంటి ఫైర్ ఫైటర్స్ అటు ఆరోగ్య భద్రత లేక.. ఇటు కొలువుల్లో ఎదుగూ బొదుగూ లేక బేజారవుతున్నారు.

ఈ కొలువు అంత తేలిక కాదు..

అగ్ని ప్రమాదం జరిగినప్పుడు బరువైన పరికరాలను ఎత్తాల్సి ఉంటుంది. వాటిని పట్టుకొని పరుగులు తీయాల్సి ఉంటుంది. ఎవరైనా మంటల్లో చిక్కుకుపోతే వారిని కాపాడేందుకు ప్రాణాలను పణంగా పెట్టాల్సి ఉంటుంది. భవంతులు ఎక్కడం ప్రమాదకర పరిస్థితుల్లో పై నుంచి దూకడం లాంటి సహసాలు కూడా చేయాల్సి వస్తుంది. పరిశ్రమలు, రసాయన గోదాములు, పత్తి మిల్లులు, బహుళ అంతస్థులు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, టింబర్ డిపోలు, ఆస్పత్రులు ఇలా ఎక్కడ అగ్ని ప్రమాదాలు జరిగినా ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో విషవాయువులు, పొగ ప్రభావంతో అగ్ని మాపక సిబ్బంది అనారోగ్యానికి గురవుతుంటారు. అగ్ని ప్రమాదాల సమయంలో గాయపడడం, కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోవడం జరుగుతుంలాయి. అయితే గాయపడిన వారికి కనీసం మెడికల్ అలవెన్స్‌లు కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఉద్యోగి మరణిస్తే ఎక్స్‌గ్రేషియా కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో అగ్ని ప్రమాదాల్లో మరణించిన సిబ్బందికి ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్నారు. ఆరోగ్య భద్రత పథకాలు అమలవుతున్నాయి. మన రాష్ట్రంలో మాత్రం ఎలాంటి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అంద డం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఏటా 600 లకు పైగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. సుమారు 250 మంది సిబ్బంది పని చేస్తున్నారు. మంటలార్పే సమయంలో విషవాయువులు, పొగ వల్ల వీరు ఊపిరితిత్తుల సమ స్యలకు గురవుతారు. క్రమంగా అది ప్రాణాంతకంగా మారుతోంది. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు కార్బన్ మోనాక్సైడ్ వెలువడితే నిమిషాల్లో స్పృహ కోల్పోతారు. ఇలా ప్రాణాలకు తెగించి పనిచేసే ఫైర్ సిబ్బందికి ప్రభుత్వం ఎలాంటి రిస్క్ అల వెన్స్‌లు ఇవ్వడం లేదు. సంవత్సరానికి రూ. 3500 యూనిఫాం అలవెన్స్ మాత్రమే ఇస్తున్నారు. ఈఎల్ 30రోజులు ఇస్తున్నారు. పదోన్నతులు, ఎక్స్‌గ్రేషియా అందడం లేదు.



ఆరోగ్య భద్రత కల్పించాలి..

అగ్ని మాపక సిబ్బందికి ఆరోగ్య భద్రత కల్పించాలి. రిస్క్ అలవెన్స్ ఇవ్వాలి. ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. యూనిఫాం అలవెన్స్ పెంచాలి. ఈఎల్‌లను 30 రోజుల నుంచి 40 రోజులకు పెంచాలి. సీనియార్టీ ప్రకారం ఫైర్ మెన్‌లకు అసిస్టెంట్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్‌గా ప్రమోషన్ కల్పించాలి. ఏఎస్ఎఫ్‌వో పోస్టులు మంజూరు చేసి ఫైర్‌మెన్‌లకు ప్రమోషన్ ఇవ్వాలి.

- వి.సుధాకర్, ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



ఫైర్ ఇంజన్

వరంగల్‌ను పర్యాటక కేంద్రంగా

అభివృద్ధి చేయాలి

- బర్డ్‌ఫ్లూతో నష్టపోయిన పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోవాలి
- పార్లమెంట్‌లో ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హనుమకొండ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌ను ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య మంగ ళవా రం పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. బర్డ్‌ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమ తీవ్రంగా దెబ్బతిన్నదని, నష్టపోయిన పౌల్ట్రీ యజమానులను ఆర్థి కంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధిచి కేంద్ర పాడిపరిశ్రమ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ సానుకూలంగా సమాధానం ఇచ్చా రు. డాక్టర్ కావ్య మాట్లాడుతూ తాను కాకతీయులు ఏలిన గడ్డపై జన్మించిన బిడ్డనని గుర్తు చేశారు. వరంగల్ కాకతీయుల రాజధానిగా విలసిల్లిన నేల అని, ఈ ప్రాం తానికి అద్వితీయమైన సాంస్కృతిక వారసత్వం, అద్భుతమైన చారిత్రక నేపథ్యం ఉందన్నారు. వేయిస్తంభాలగుడి, కాకతీయుల కళాతోరణం, ఓరు గల్లు కోట, యునెస్కో గుర్తించిన రామప్ప, ప్రతీ రెండేళ్ల కొకసారి కోటిన్నర మందికిపైగా భక్తులు హాజరయ్యే సమ్మక్క సారలమ్మ జాతర తదితర పర్యా టక ప్రాంతాలు ఉన్నాయని వివరించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా ఈ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని డాక్టర్ కావ్య కోరారు. వరంగల్‌ను ముఖ్య టూరిజం హబ్‌గా చేయడం వల్ల ఈ ప్రాంతాలకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈ దృష్ట్యా వరంగల్‌ను ప్రముఖ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రిని ఆమె అభ్యర్థించారు.

పౌల్ట్రీ రైతులను ఆదుకోండి



తెలంగాణలో బర్డ్ ఫ్లూ వల్ల లక్షలాది కోళ్ల మృత్యువాత పడ్డాయనీ, దీంతో పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, ఈ తరుణంలో పౌల్ట్రీ పరిశ్రమదారులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బర్డ్‌ఫ్లూ వల్ల నష్టపోయిన పౌల్ట్రీ పరిశ్రమను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోంది..?, ఈ పరిశ్రమపై ఆధారపడిన మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఎలాంటి పథకాలను చేపట్టబోతున్నది, మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువుల మార్కెటింగ్‌కు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నది తెలియ చేయాలని కోరారు. ఇందుకు కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడిపరిశ్రమ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లలన్ సింగ్ సమాధానం ఇస్తూ బర్డ్ ఫ్లూ గురించి విడిగా, వివరంగా తెలియ చేస్తానని చెప్పారు. బర్డ్‌ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమకు జరిగిన నష్ట నివారణకు ఏం చేయాలనే విషయంలో కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. పాడిపరిశ్రమను ప్రస్తావిస్తూ దేశంలో పాల ఉత్పత్తి అద్భుతంగా జరుగుతోందని, దేశంలో 95 శాతం పాల సేకరణ డేయిరీల ద్వారానే సాగుతోందని అన్నారు. 39 శాతం పాల ఉత్పత్తి అసంఘటిత రంగంలోనే జరుగుతోందని చెప్పారు. మహిళలు ఎక్కువగా ఆధారపడే పాల ఉత్పత్తిని పూర్తిగా సంఘటిత రంగంలోకి తీసుకువచ్చేందుకు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు కృషి చేస్తోందన్నారు. తద్వారా పాడి రైతులకు, ముఖ్యంగా మహిళలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

నందిని సిధారెడ్డి చేతుల మీదుగా సత్కారం (ఫైల్)



సాహితీ పద సంపద

లగిశెట్టి

- సాహిత్య అవార్డులు ఆయన సొంతం
- సామాజిక స్పృహలో లఘుచిత్రాల నిర్మాణం



లగిశెట్టి ప్రభాకర్

జనగామ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సాహితీరంగంలో ఎనలేని కృషి చేస్తూ ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంటున్నారు లగిశెట్టి ప్రభాకర్. జనగామ జిల్లా కేంద్రంలో లగిశెట్టి రామస్వామి, కిష్టమ్మ దంపతులకు 1956లో జన్మించిన లగిశెట్టి ప్రభాకర్.. ఎం.ఏ, బీఈడీ పూర్తి చేసి ఉపాధ్యాయ వృత్తి చేపట్టారు. ఉన్నత పాఠశాల స్థాయిలో విద్యాభ్యాసం చేస్తున్న క్రమంలోనే పేరడీ పాటలు రాశారు. 1967-68 సంవత్సరాల్లో ఆయన మిత్రులు మసురం రాజేంద్రప్రసాద్ సంపాదకత్వంలోని ఉదయకిరణాలు పత్రికలో తొలిసారిగా ప్రభాకర్ రాసిన సంక్రాంతి కవిత అచ్చు వేశారు. ఉద్యోగ నిర్వహణలో ఉన్న సమయంలో వీడ్కోలు, స్కూల్‌డే లాంటి సందర్భాల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రభాకర్ పెద్దదిక్కు అనే లఘునాటిక, నృత్యగీతాలు రచించి విద్యార్థులచే ప్రదర్శింపజేసి మంచి శిక్షకుడిగా, నిర్వాహకులుగా పేరు సంపాదించారు. తెలంగాణ యాసలో, కవన హస్త్రాలతో సమాజాన్ని మేల్కొలిపే భావజాలం, మస్తిష్క మేధోమథనంతో సాహిత్యాన్ని సృజిస్తూ సాహిత్యక్షేత్రంలో విహరిస్తున్న బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుతెచ్చుకున్నారు.

1150 కవితలు..

ఉద్యోగ విరమణ తర్వాత లగిశెట్టి ప్రభాకర్ పూర్తి స్థాయిలో కవిత్వంపై దృష్టి పెట్టారు. మానవత్వం, కుటుంబ బంధాలు, సామాజిక చైతన్యం, ప్రేమ కవితలు పేరుతో దాదాపు 1150 కవితలు రాశారు. 'ప్రతిలిపి' అనే యాప్‌లో కవితలను అప్లోడ్ చేసి సాహితీ ప్రపంచానికి చేరువయ్యారు. ఆయన కవితలు అనేక పత్రికల్లో ప్రచురితమయ్యాయి. తెలంగాణ సాహిత్యకళాపీఠం, వాగ్దేవీ సాహిత్య కళావేదిక, శ్రీశ్రీ కళావేదిక, కవి హృదయం సాహిత్య వేదిక, జీవైగిరి ఫౌండేషన్, జనగామ రచయితల సంఘం (జరసం), కవులు కళాకారుల ఐక్యవేదిక సార థ్యంలో నిర్వహించినకవి సమ్మే ళనాలు, సాహితీ కార్యక్రమాల్లో ప్రభాకర్ పాల్గొని కవితా పఠ నం చేసి అవార్డులు, రివార్డు లు, ప్రశంసాపత్రాలు అందుకు న్నారు. తాను రాసిన కవిత్వం వల్ల ప్రజల్లో మార్పుకు నాంది పలికితే ఆశయం నెరవేరినట్లే అని భావిస్తున్న ప్రభాకర్ కేవలం కవిగానే కాకుండా నటు డు, వ్యాఖ్యాత, ఏకపాత్రాభిదారి, పల్లెసుద్దు లు కథకులుగా అనేక ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే సామాజిక అంశాలను స్పృశిస్తూ తనదైన శైలిలో లగిశెట్టి ప్రభాకర్ లఘు చిత్రాలను సైతం నిర్మించారు. సీసీసీ జన గామ యూట్యూబ్ చానల్‌లో 'తనదాకా వస్తే', 'ఎవరు మారాలి', 'ముదురు మొగు డు - ముద్దుల పెళ్లాం', 'మీదే బాధ్యత', 'ఇచ్చి అడుగబోతే' మొదలగు లఘుచిత్రా లకు కథను సమకూర్చి, దర్శకత్వం వహించి, నటించారు. అంతేగాకుండా 'ఓ వయసు పోరగా' పాటలో రాజకీయ నాయకుని పాత్రలో కనిపించారు.

సన్మాన, సత్కారాలివే..

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పలు సాహిత్య సంస్థలు ఏర్పాటు చేసే సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొని ఎన్నో సత్కారాలు అందుకున్నారు. వాగ్దేవీ సాహితీ వేదిక, సేవా ప్రాధాన్య సాహితీ వేదిక, కుసుమ ధార్మిక కళాపీఠం, విమల సాహితీ సమితి, కవితారల వేదిక లాంటి సాహితీ సంస్థల్లో నిర్వహించిన కవితా పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నారు. తన స్వీయ రచనలను పుస్తక రూపంలో పొందుపరిచిన లగిశెట్టి రేపటి వెలుగు, నవ్య నానీలు పుస్తకాలు విడుదలయ్యాయి. కాగా రేపటి వెలుగు పుస్తకానికి గాను ప్రభాకర్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. విజయవాడలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ కమిటీ చైర్మెన్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా 'తెలుగు కీర్తి' సాహిత్య పురస్కారం అందుకున్నారు. ప్రముఖ సాహితీవేత్త లింగంపల్లి రామచంద్ర, తెలంగాణ సాహిత్య అకాడెమీ తొలి అధ్యక్షులు నందిని సిధారెడ్డి చేతుల మీదుగా గౌరవ సత్కారం సైతం అందుకున్నారు.



లగిశెట్టి రచించిన రేపటివెలుగు పుస్తకం


ఆహ్లాదం పంచేలా..

పర్యాటకులు మెచ్చేలా..

కట్టపై నుంచి బోటింగ్ పాయింట్ వద్దకు వెళ్లేందుకు ఆకర్షణీయంగా నిర్మించిన మెట్లు



- అభివృద్ధి దిశగా పాకాల సరస్సు ప్రాంతం
- పర్యాటకులకు వసతుల కల్పనకు ఏర్పాట్లు



పాకాల సరస్సు వ్యూ పాయింట్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బ్యాటరీ వాహనం



పాకాలలో ఏర్పాటు చేసిన బోటింగ్ పాయింట్

ఖానాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలకు, రమణీయ దృశ్యాలకు నెలవు పాకాల సరస్సు. ఈ సరస్సు చుట్టూ ఉన్నా అభయారణ్యం, చెట్లు చేమలు, ఎత్తైన కొండల మధ్య నిండుకుండలా కనిపించే పాకాల సరస్సు ప్రకృతి రమణీయతకు ఆలవాలంగా విలసిల్లుతోంది. సరస్సు మధ్యలో ఉండే చిలుకల గుట్ట, కట్ట వెంబడి ఉన్న తూములు, మత్తడి ప్రదేశం, బటర్‌ఫ్లై గార్డెన్, తూములపై నుంచి సరస్సు అందాలను వీక్షిస్తూ పర్యాటకులు మురిసిపోతుంటారు. ఈ క్రమంలో పాకాల సరస్సు సందర్శనకు వచ్చే పర్యాటకుల మదిని దోచేలా సొబగుల కల్పనకు అడుగులు పడుతున్నాయి. పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చేసేందుకు పాకాలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. పాకాలను పర్యాటక పరంగా అభివృద్ధి చేసేందుకు పనులు కొనసాగుతున్నాయి.

ఆహ్లాదం పంచేలా.. పర్యాటకులు మెచ్చేలా...

పాకాల పర్యాటనకు వచ్చే పర్యాటకులు ఆహ్లాద వాతావరణంలో విహరించేలా, వారి మనసును దోచుకునేలా పాకాలలో ఎకో టూరిజంలో భాగంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో రూ.30లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు. పాకాలలో బోటింగ్ సౌకర్యం కల్పించారు. బోటింగ్ పాయింట్ వద్దకు వెళ్లేందుకు కట్టపై నుంచి బోటింగ్ పాయింట్ వరకు మెట్ల నిర్మాణం చేపట్టి ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన క్రొకొడైల్ సఫారీ అర్చి పర్యాటకులను ఆకట్టుకొంటోంది. అదేవిధంగా కట్టపై బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. పర్యాటకులు కట్టపై విహరిస్తూ సరస్సు అందాలను వీక్షించేందుకు బ్యాటరీ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటితో పాటు బటర్ ఫ్లై గార్డెన్ ఆధునీకరణ, వ్యూపాయింట్ ఏర్పాటు, బండ్ ప్లాంటింగ్, చిల్డ్రన్ గార్డెన్, నైట్ క్యాంపింగ్ ఏరియా అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు.

టూరిజం సర్క్యూట్‌గా పాకాల

పాకాల అభివృద్ధిపై అధికారులు దృష్టిసారించారు. టూరిజం సర్క్యూట్‌గా పాకాలను అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. పాకాలలో ట్రెక్కింగ్ సౌకర్యంతో పాటు జంగిల్ సఫారీ, పాకాల నుంచి భీమునిపాదం మీదుగా పులిమడుగు తదితర పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా పాకాలను అభివృద్ధి చేయనున్నారు.

వీటిపై కూడా దృష్టి సారించాలి..

పాకాల సందర్శనకు వచ్చే పర్యాటకులకు ఇంతకాలం సరైన వసతులు, సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పాకాలలో ఏర్పాటు చేసిన హరిత రెస్టారెంట్ నిర్వాహణ సరిగా లేక పోవడం, భోజన వసతి లేక పర్యాటకులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. కనీసం పాకాలలో ఆహారం, తాగునీరు, కనీస సౌకర్యాలు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పాకాలలో గతంలో ఏర్పాటు చేసిన అధ్యాయన కేంద్రం, జిప్‌లైన్ నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి వాటిని పునరుద్ధరించాల్సిన అవస రం ఉంది. అదేవిధంగా ఔషధ వనంలోని మొక్కలు ఎండిపోయాయి. పాకాల కట్టపైన గ్రీనరీ లేకపోవడంతో పాకాల పరిసరాలు కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. వీటిపై దృష్టిసారించి పర్యాటకులను ఆకర్షించే విధంగా పాకాలను మరింత అభివృద్ధి చేయాల్సి ఉంటుందని పర్యాటకులు ఆశిస్తున్నారు.

అవకాశం.. దక్కేనా?

మంత్రి వర్గ విస్తరణపై ఆశావహుల్లో ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసినా.. కులసమీకరణలు కలిసి రాకపోవటంతో వారికి నిరాశే ఎదురవుతోంది. అయితే త్వరలో జరగబోయే విస్తరణలో కొత్తగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పేరు తెరపైకి వస్తోంది. అయితే సీఎం రేవంత్ రెడ్డితో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్న దొంతి మాధవరెడ్డికి అసలు మంత్రివర్గంలో చోటు ఎలా దక్కుతుందనే చర్చ కూడా మొద లైంది. ఎన్నికలకు ముందు టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో హత్‌సే హత్ జోడో యాత్రను నిర్వహించారు. కానీ అప్పట్లో ఆయన నర్సంపేట నియోజకవర్గానికి మాత్రం రాలేకపోయారు. మాధవరెడ్డి సహకరించకపోవటంతోనే రేవంత్ రెడ్డి నర్సంపేటలో పర్యటించలేదనే చర్చ ఉంది. అంతేకాకుండా సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత కూడా మర్యాదపూ ర్వకంగా కూడా దొంతి కలవలేదనే ప్రచారం ఉంది. పైగా ఈ 15నె లల కాలంలో సీఎం రేవంత్ నాలుగై దు సార్లు ఉమ్మడి వరంగల్ పర్యటనకు వచ్చినా.. మాధవరెడ్డి దూరా న్ని పాటించారు. సీఎంతో కలిసి ఒక్క సభలో కూడా పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో మంత్రి పదవి కోసం మాధవరెడ్డి ఢిల్లీ స్థాయిలో ఏఐసీసీ నేతలతో తీవ్ర లాబీయింగ్ చేశారనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర భారీనీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న క్రమంలో మాధవరెడ్డికి మంత్రి పదవిని ఇప్పించేందుకు ఉత్తమ్ కుమార్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం పొలిటికల్ సర్కిల్‌లో జోరుగా జరుగుతోంది. అయితే నల్లగొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డికి పదవి ఇచ్చేందుకు అధిష్ఠానం సుముఖంగా లేకపోతే.. అదే సామాజిక వర్గానికి చెందిన మాధవరెడ్డికి మంత్రి పదవి పక్కా అని ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. మరోవైపు పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల్లో భరోసా కల్పించడంతో పాటు కొత్తగా పార్టీలోకి వచ్చేవారికి పార్టీ అండగా ఉంటుందన్న సంకేతాలు ఇచ్చేందుకు ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని అధిష్ఠానంపై ఒత్తిడి పెరుగుతోందన్న చర్చ జరుగుతోంది. అదే జరిగితే సీనియర్ ఎమ్మెల్యేగా, మంత్రిగా సుదీర్ఘ అనుభవం ఉన్న స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి అవకాశం దక్కవచ్చుననే చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న సన్నిహిత సంబంధాలు కడియం శ్రీహరికి కలిసొస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తిరుపతిలో భద్రకాళి శేషుకు సత్కారం

అగమ విద్వన్మణి పురస్కారం ప్రదానం



సత్కారం అందుకుంటున్న భద్రకాళి శేషు

హనుమకొండ కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఉగాది పర్వాన్ని పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన విశ్వవిద్యాలయ వార్షికోత్సవ సమారోహణలో వరంగల్ నగరానికి చెందిన భద్రకాళి అలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు అగమ విద్వన్మణి బిరుదుతో ఘనంగా సత్కారం అందుకున్నారు. సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ జి. ఆర్‌ఆర్ కృష్ణమూర్తి, ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ విష్ణుభట్టాచార్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన ప్రఖ్యాత శాస్త్రవేత్త రాఘవేంద్ర చేతుల మీదుగా భద్రకాళి శేషు సత్కారాన్ని పొందారు. ఈ సందర్భంగా భద్రకాళి శేషు తిరుపతి నుంచి ఆంధ్రజ్యోతిలో మాట్లాడుతూ.. తిరుపతిలో జరిగిన తన సత్కారంతో తన జన్మ ధాన్యమైందన్నారు. అమ్మవారి కృపవల్లే తనకు ఈ అవకాశం లభించిందన్నారు.



ఏడీఏ ప్రశాంత్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

కొత్త విద్యుత్ మీటర్లు, స్తంభాల ఏర్పాటు చేయాలి

మహబూబాబాద్ టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని కరెంటు మీటర్లులేని నిరుపేదలకు కొత్త విద్యుత్ మీటర్లు, కరెంట్ స్తంభాలు లేనిచోట నూతన స్తంభాలను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఐ మాజీమునిసిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్ సారధిరెడ్డిఅన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డీఈ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. మునిసిపాలిటీ పరిధిలోని 22, 36వార్డులతో పాటు అన్ని వార్డుల్లో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ సమస్య లేకుండా చూడాలన్నారు. మీటర్లకు డబ్బులు కట్టి చాలా రోజులు అయినప్పటికి వారికి నూతన విద్యుత్ మీటర్లు ఇవ్వడం లేదని, తక్షణమే వారి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్, అశోక్, ప్రవీణ్, కూరాకుల పాల్, సాంబయ్య, మంద శంకర్, తండ శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు రెమ్యునరేషన్ చెల్లించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేసిన ఎన్యుమరేటర్స్, సూపర్ వైజర్లకు రెమ్యునరేషన్ చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో జిల్లా ముఖ్యగణాంక అధికారి విజయలక్ష్మీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నవంబరు 4 నుంచి డిసెంబరు 16 వరకు ఇంటింట కుటుంబ సర్వేచేసిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకునేటి వరకు రెమ్మునరేషన్ చెల్లించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రెమ్యునరేషన్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా స్టాటిస్టికల్ అధికారి విజయలక్ష్మీ మాట్లాడుతూ...ఇప్పటికే సర్వేకు సంబంధించిన రెమ్మునరేషన్ బిల్లులను ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, కొన్ని సాంకేతిక సమస్యల వలన ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు రెమ్యునరేషన్ అందలేదన్నారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. బొల్లం శ్రీనివాస్, రాచకొండ ఉపేందర్, సజ్జనము విద్యాసాగర్, వెంపటి విజయ్‌రాజ్, రమేష్, రహీముద్దీన్, అమితాబ్ పాల్గొన్నారు.



జిల్లా ముఖ్య గణాంక అధికారి విజయలక్ష్మీకి వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

వ్యవసాయ పనిముట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాంత్రీకరణ పథకం (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్-2024-25) ద్వార వివిధ వ్యవసాయ పనిముట్లకు మహిళ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మహబూబాబాద్ మండల వ్యవసాయాధికారి ఎన్.తిరుపతిరెడ్డి కోరారు. మహిళ రైతుల పేరుపై పట్టాదారుపాస్‌పుస్తకం, ట్రాక్టర్ల పనిముట్ల కోసం దరఖాస్తుచేసుకుంటే ట్రాక్టర్ ఆర్‌సీ, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు దరఖాస్తును పూర్తి చేసి రైతు వేదికలో అందించాలని, మహిళ, సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీపై ఈపనిముట్లు అందించనున్నట్లు చెప్పారు. మహబూబాబాద్ మండలానికి 5 పవర్ స్ప్రేలు మంజూరు అయ్యాయని, జనరల్ కేటగిరి కింద నాలుగు, ఎస్సీకి ఒకటి, బ్యాటరీ స్ప్రేయర్లు జనరల్ వారికి 4, ఎస్సీ 1, రోటోవేటర్లు జనరల్ వారికి 2, ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కటి చొప్పున, కల్టివేటర్లు/ ఎంబిప్లౌ/ డిస్కుహారో కొరకు జనరల్ 3, బండుఫార్మర్ కింద జనరల్-1, ఎస్టీ-1, గడ్డికట్టలు చుట్టే యంత్రం ఎస్టీ1 చొప్పున కేటాయించడం జరిగిందని, మొత్తం సబ్సిడీ విలువ 4.23 లక్షలు కేటాయించడం జరిగిందని తెలిపారు. మహిళ రైతులు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 27న చివరితేదీ అని పేర్కొన్నారు.

ఇనుగుర్తిలో..

● ఇనుగుర్తి, (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా చిన్న, సన్నకారు మహిళా రైతులకు సగం రాయితీతో వ్యవసాయ పనిముట్లు పొందేందుకు తమ కార్యాలయంలో ఈనెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని ఏవో బి.మహేందర్ మంగళవారం తెలిపారు.

ఈ పథకంలో పవర్ స్ప్రేయర్లు 3, బ్యాటరీ స్ప్రేయర్లు 3, ట్రాక్టర్ రోటవేటర్స్ 2, ట్రాక్టర్‌తో కల్టివేటర్లు, ఎంబీ ఫ్లవ్, డిస్క్ హారో 2 వెరసి 10 పనిముట్లకురూ.1.63లక్షల రాయితీని ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ ప్రతులను జతపరుస్తూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వ్యక్తికి ఏడాది జైలు శిక్ష, వెయ్యి జరిమానా

మహబూబాబాద్ రూరల్, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : ఘర్షణ కేసులో ఓ వ్యక్తికి జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు అడిషనల్ జూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రీట్ తిరుపతి మంగళవారం తీర్పు వెల్లడించినట్లు కోర్టు మహబూబాబాద్ రూరల్ కానిస్టేబుల్ సురేష్ తెలిపారు. సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్‌మండలం 2020లో పొలం వద్ద పనిచేస్తున్న అమనగల్ పెద్దతండాకు చెందిన గుగులోతు పర్తియాను అదే తండాకు చెందిన ఇస్లావత్ శ్రీకాంత్ బండరాయితో కొట్టి గాయపరిచినట్లు చెప్పారు. అప్పటి ఎస్సై రమేష్‌బాబు కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయగా.. అప్పట్నుంచి నేటి వరకు కేసు నడుస్తూ వచ్చిందని చెప్పారు. కానిస్టేబుల్ సురేష్ 8 మంది సాక్షులనుప్రవేశపెట్టగా ఏపీపీ జయలత కేసును వాదించగా. పూర్వపరాలు విన్న మహబూబాబాద్ జిల్లా కోర్టు అడిషనల్ జూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రీట్ తిరుపతి నిందితుడు శ్రీకాంత్‌కు సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు సురేష్ తెలిపారు. ఈ కేసుకు సహకరించిన రూరల్ ఎస్సై దీపిక, కోర్టు కానిస్టేబుల్ సురేష్‌ను అధికారులు అభినందించారు.

కేసముద్రం అంగడి రూ.21.15లక్షలకు వేలం

కేసముద్రం, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ కార్యాలయంలో కమీషనర్ ఆదేశాల మేరకు మంగళవారం ఏడాది పాటు అంగడి వేలం నిర్వహించగా మాజీ సర్పంచ్ బట్టు శ్రీను రూ.21.15 లక్షలకు కైవసం చేసుకున్నారు. ఈ వేలంలో ఆరుగురు పాల్గొనగా శ్రీను దక్కించుకున్నట్లు మునిసిపాలిటీ ఇన్‌చార్జ్ రెవెన్యూ ఆఫీసర్ ఎల్.కుమార్ తెలిపారు. ఇన్‌చార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సింగని ప్రభాకర్, బిల్ కలెక్టర్లు రాము, సంతోష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ

కేసముద్రం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మునిసిపాలిటీ పరిధిలోని అమినాపురం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ చిల్డ్రన్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సంస్థ రాష్ట్ర కార్యదర్శి కుమ్మడి సంపత్, విలాసారం త్రివిక్రమ్, బెల్లంకొండ శ్రీనివాసరావు, కొండపాక దేవి, సంస్థ మండల అధ్యక్షుడు సోమారపు శ్రీరాములు, జన్ను శ్రీనివాస్, కాసు సతీష్ పాల్గొన్నారు.

సైన్స్, గణితంపై ఆసక్తిని పెంచుకోవాలి



జడ్పీహైస్కూల్లో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

డోర్నకల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : సైన్స్ గణితంతో పాటు శాస్త్రసాంకేతిక రంగాలలో నూతన ఆవిష్కరణలు చేయడానికి విద్యార్థులు ఆసక్తిపెంచుకోవాలని డోర్నకల్ జడ్పీహైస్కూల్ హెచ్‌ఎం బండి నర్సింహారావు అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీహైస్కూల్లో యువ విజ్ఞాన శాస్త్ర, యువ గణితశాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ సైన్స్ నిత్యజీవితంలో మానవాళి పురోగాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. గణితంతో కచ్చితమైన గమ్యాన్ని నిర్దేశించుకోవచ్చని తెలిపారు. గణితం, సైన్స్ సబ్జెక్టులో ప్రతిభ కనబరిచిన 75 మంది విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు వసంతరాణి, అమీన, మంజులత, శ్యామల, మాలతి, గ్రేసమ్మ, అప్పిరెడ్డి, సాహెబ్ అలీ, వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారులకు టీషర్టుల వితరణ

గార్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని క్రికెట్ క్రీడాకారులకు వడ్లమూడి దుర్గాప్రసాద్ యువసేన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం టీషర్ట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు ఎస్‌కే యాకుబ్ పాష మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు తీసుకపోతూ మంచి విజయాలు సాధించాలన్నారు. క్రీడాకారులకు నాణ్యమైన టీషట్లు అందజేసిన దుర్గాప్రసాద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బాబులాల్ నాయక్, అందనాల రాజీవ్ నాయుడు, కొండ రవీందర్, శరత్, సాయి, రామారావు, వాజీద్, నజీద్, గోవింద్ పాల్గొన్నారు.

మొగిలిచర్లలో పామాయిల్‌తోట దగ్ధం

కురవి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మొగిలిచర్లలో మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పామాయిల్‌తోట దగ్ధమైంది. బాధిత రైతు నంజాల హేమరాజు తెలిపిన వివరాల ప్రకారం. రెండున్నర సంవత్సరాల క్రితం 13 ఎకరాల్లో పామాయిల్ తోటను వేసి సాగు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో గుట్టల నుంచి వచ్చిన మంటలు పామాయిల్‌తోటకు అంటుకున్నాయి. ఈ క్రమంలో తోటలోని డ్రిప్ ఇరిగేషన్ కేబుల్ పూర్తిగా దగ్ధమైంది. సుమారు 7ఎకరాల్లో పామాయిల్ చెట్లు కాలిపోయాయి. ఫైర్‌స్టేషన్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని రైతు వాపోయాడు. తోట దగ్ధంతో ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లిందని ప్రభుత్వం అదుకోవాలని వేడుకున్నాడు

పడిపోయిన మిర్చి బస్తాలు రైతుకు అందజేత

కురవి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌కు తీసుకువెళ్తున్న మిర్చి బస్తాలు రోడ్డుపై పడిపోగా, ఆ మిర్చి బస్తాలను తిరిగి రైతుకు అందించాడు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్. వివరాల్లోకి వెళ్తే గార్ల మండలం పోచారం గ్రామం నుంచి ఎస్.వెంకటేశ్వర్లు అనే రైతు మహబూబాబాద్ మిర్చి మార్కెట్‌కు బస్తాలను ఆటోలో తీసుకువెళ్తున్నాడు. ఈ క్రమంలో కురవి మండలం బంచరాయితండా వద్ద మూడు మిర్చిబస్తాలు రోడ్డుపై పడిపోయాయి. ఇదిగమనించని రైతు నేరుగా మార్కెట్‌కు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో బయ్యారం నుంచి బంచరాయితండాకు వస్తున్న దేవేందర్ బస్తాలను చూసి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసుల సహకారంతో ఆ మిర్చి బస్తాలను మంగళవారం ఉదయం రైతు వెంకటేశ్వర్లుకు అందించారు. కురవి కానిస్టేబుల్ రమేష్ సహకరించారు. రైతు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మిర్చి బస్తాలను తిరిగి అందించిన దేవేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ సర్కిల్‌గా కేసముద్రం?

(5వ పేజీ తరువాయి)

పాలకులు ప్రతిపాదిస్తున్నట్లు సూత్రప్రాయంగా తెలిసింది. ఇప్పటికే కేసముద్రం పోలీస్‌స్టేషన్‌కు రెండు ఎస్‌ఐ పోస్టులు మంజూరై కొనసాగుతున్నాయి.

ఇనుగుర్తిలో నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే మూడుస్టేషన్లతో సర్కిల్ ఏర్పాటుకు అనుకూలంగా ఉంది. నూతన పోలీస్ సర్కిల్ ఏర్పాటైతే ఒక సీఐ, అదనంగా ఎస్‌ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పోస్టులు, మునిసిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ విభాగం మంజూరుకానున్నాయి. ఇదిలా ఉండగా కేసముద్రం రైల్వేస్టేషన్ పరిధిలోని పాత పోలీస్‌స్టేషన్ స్థలాన్ని మంగళవారం పోలీసులు చదును చేయించారు. ఇక్కడ పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేసి శాంతిభద్రతలు, ట్రాఫిక్ పర్యవేక్షణతో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిసింది. ఏదేమైనా త్వరలోనే కేసముద్రం పోలీస్‌శాఖలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకొని పోలీస్ సర్కిల్‌గా ఏర్పడబోతోందనేది వాస్తవం.

ఎన్నికల హామీలను నేరవేరుస్తాం

కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి

పెద్దవంగర, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బరాబర్ చేసి తీరుతామని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జీ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. పెద్దవంగర మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తామని తెలిపారు. గ్రామాలలో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కారించడం జరుగుతుందన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సర్కారుపై ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియాజేయాలన్నారు. మండలస్థాయి, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ జెండానే ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, కాంగ్రెస్ నాయకులు రంగు మురళి, హరికృష్ణ, సమ్మయ్య, శ్రీనాథ్, సంతోష్, సాంబి, రజినికాంత్, రామ్‌చరణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

శ్రీముసలమ్మ గుడి ఆవరణలో సీసీ రోడ్డు నిర్మాణం



గుంజేడు దేవాలయం వద్ద సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వజ్జ సారయ్య

కొత్తగూడ, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : గుంజేడులోని శ్రీముసలమ్మ గుడి ఆవరణలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముసలమ్మ దేవత దేవాలయంను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి సీతక్క మంజూరు చేసిన నిధులతో దేవాలయం వద్ద మంగళవారం అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడు నిర్మాణం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య పనులను ప్రారంబించారు. ఈవో శేషగిరి, దేవాదాయ శాఖ సిబ్బంది వెంకట్‌రెడ్డి, భట్టు వెంకన్న, డీసీసీ జనరల్ సెక్రెటరీ బానోత్ రూప్ సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, జిల్లా నాయకులు వెంకన్న, మాజీ ఎంపీటీసీ భూక్య పుష్పలత నరేందర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కేదాసు ప్రసాద్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెదకాసు మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ నేత యుగేందర్‌రెడ్డి

ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌తోనే ఊరూరా సీసీ రోడ్లు

● **కాంగ్రెస్ జిల్లా నేత వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి**

మరిపెడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ కృషితోనే ఊరూరా సీసీ రోడ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కాంగ్రెస్ నేత వంటికొమ్ము యుగేందర్ రెడ్డి అన్నారు. మరిపెడ మండలం అబ్బాయిపాలెంలో మంగళవారం ఎన్‌ఆర్ఈజీఎస్ కింద చేపట్టి రూ.15 లక్షల సీసీ రోడ్డు పనులకు ఆయన శ్రీకారం చుట్టి అక్కడి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రోడ్ల నిర్మాణ పనులను నాణ్యతగా నిర్మించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ అజయ్, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మీ, ఎఫ్‌ఏ రాయల రవి, బిల్‌కలెక్టర్ యాదగిరి, మాజీ ఎంపీటీసీలు జినక వీరయ్య, భానోత్ బుజ్జి, అల్వాల శ్రీను, జినుక ఉపేందర్, జిన్న బిక్షం, షరీఫ్, వెంకన్న, రాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

మహబూబాబాద్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం శిఖార్‌ఖాన్‌గడ్డకు చెందిన ఓ విద్యార్థి అదృశ్యమైనట్లు మానుకోట రూరల్ ఎస్సై దీపికారెడ్డి మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం...శిఖార్‌ఖాన్‌గడ్డకు చెందినమంద రవికుమార్-శ్వేత దంపతుల కుమారుడు మంద హర్ష ముత్యాలమ్మగూడెంలోని ఓ ప్రైవేటు పాఠశాల హాస్టల్‌లో ఉంటూ 7వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి పాఠశాల నుంచి ఆటోలో మహబూబాబాద్‌కు బయలు దేరిన విద్యార్థి ఇంటికి చేరుకోలేదని చెప్పారు. పాఠశాల యాజమాన్యం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు విద్యార్థి కోసం ఎక్కడ వెతికినా ఆచూకి తెలువకపోవడంతో తల్లిశ్వేత మానుకోట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, తల్లి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దీపికారెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి సాయం

మరిపెడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబానికి ఎల్లంపేట హైస్కూల్‌కు చెందిన 1997-98 టెన్త్‌బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం రూ.10వేల ఆర్థిక సహాయం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. గత కొద్ది రోజుల క్రితం ఎల్లంపేటకు చెందిన బత్తెం అజయ్ విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. గురుమూర్తి, యాకయ్య, కృష్ణ, మహేశ్, కిషన్, సోమయ్య, రమేశ్, భరత్ పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులు హేయం

తొర్రూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై దాడులు చేస్తూ హత్యలు చేయడం న్యాయ వ్యవస్థకే తీవ్రమైన అపాయం అని తొర్రూరు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ గణపురం రామకృష్ణ పేర్కొన్నారు. నిన్న హైదరాబాద్‌లో కేసు ఎందుకు వాదిస్తున్నావని ఒక దుండగుడు ఇజ్రాయిల్ అనే న్యాయవాది హత్య న్యాయ వ్యవస్థకే చెడు పరిణామం అని, ఇలాంటి సంఘటన వల్ల సమాజం ఎటుపోతుందో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. సమాజంలో న్యాయవ్యవస్థపై కీలక పాత్ర పోషిస్తున్న న్యాయవాదులపై జరుగుతున్న దాడులు అమానవీయమని, బాధ్యులైన ముద్దాయిలను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో న్యాయవాదులు వల్లపు మధుసూదన్, ముకుంద రావు, యాకాంబ్రం, రఘురామ్ రెడ్డి, ఐలోని, లాలు, నగేష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, యాకేందర్ తదితరులు ఉన్నారు.



కోర్టు ఎదుట ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

రైతులను ఆదుకోవాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : గత మూడు, నాలుగు రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతన్నలను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాళ్ల వర్షం పెద్దఎత్తున వచ్చి పంటలు దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేలు నష్టపరిహారం అందించాలన్నారు. ముఖ్యంగా మొక్కజొన్న, వరి,మిర్చి, పత్తి, మామిడి, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ములుకూరి జగ్గన్న, పూనెం ప్రభాకర్, పైండ్ల యాకయ్యపాపారావు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలతో సమాజ సమతుల్యతకు చేటు

మహబూబాబాద్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : అడపిల్ల అనగానే కొంతమంది గర్భంలోనే పిండాలను చంపుతూ.. భ్రూణహత్యలకు పాల్పడుతున్నారని, తద్వారా సమాజంలో ఆడ, మగ నిష్పత్తిలో సమానసమతుల్యత దెబ్బతింటుందని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు పరికిపండ్ల అశోక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జగన్ కాలనీలో అంగన్‌వాడీ సెంటర్‌లో 'ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం' అంటూ భ్రూణహత్యలకు వ్యతిరేకంగా మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మార్చి 25 పుట్టబోయే బిడ్డల అంతర్జాతీయ దినోత్సవంగా ప్రపంచమంత జరుపుకుంటారని చెప్పారు. గర్భస్రవనానికి వ్యతిరేక దినంగా పరిగణించబడి పుట్టబోయే పిండాల జ్ఞాపకార్థం జరుపుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వాహిని, పద్మావతి, కవిత, అంగన్‌వాడీ టీచర్ కీసర సౌమ్యశ్రీ, స్నేహబిందు, సుభద్ర, భవాని, ధనమ్మ, పుష్ప, దీపిక, ప్రియాంక, భారతమ్మ, మల్లిక పాల్గొన్నారు.



భ్రూణ హత్యలకు వ్యతిరేకంగా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పరికిపండ్ల అశోక్

నిధులు విడుదల చేయాలి

మరిపెడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి రైతు భరోసా నిధులు విడుదల చేసి రైతన్నలను ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ కార్యకర్తల సమావేశం మరిపెడబంగ్లాలో జరుగగా ఆయన హాజరై మాట్లాడారు. రబీ సీజన్ పూర్తి దశకు వచ్చిన రైతు భరోసా ఇవ్వలేదని ఆరోపించారు. పార్టీ మండల బాధ్యులు మారగాని బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, పోలపాక వెంకన్న పాల్గొన్నారు.

పోటీలను రద్దు చేయాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో త్వరలో జరుగబోయే 72వ ప్రపంచ సుందరి పోటీలను తక్షణమే రద్దు చేయాలని ప్రగతిశీల మహిళ సంఘం (పీవోడబ్ల్యూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతమ్మ, ఊకె పద్మలు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం అధికారి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రపంచ సుందరి పోటీలు రద్దయ్యేంత వరకు పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు.

నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు

మహబూబాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడానికి కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యుత్‌శాఖ అధికారి నరేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో లోడుకు అనుగుణంగా సిబ్బంది, అధికారులు అహర్నిశలు శ్రమిస్తూ ముమ్మరంగా చర్యలు చేపడుతున్నారని చెప్పారు. లోడు పెరిగే అవకాశం ఉన్నచోట నేటి వరకు ఐదు పవర్‌ట్రాన్స్‌ఫార్మర్లను, ఒక పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం కూడ పెంచినట్లు చెప్పారు. 130 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయగా 39 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచినట్లు తెలిపారు. గత మూడునెలల నుంచి వేసవికాలం ముందస్తు కార్యచరణ, ప్రణాళిక సిద్ధం చేసుకుని అందుకు అనుగుణంగా సరిపడ మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు లైన్లలో 10 కెపాసిటర్లనుబ్యాంకుల వద్ద ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. వీటి వలన సబ్‌స్టేషన్ లైన్‌లలో విద్యుత్ సరఫరాలో ఓవర్ లోడ్ పడకుండ నియంత్రిస్తుందన్నారు. ఇప్పటి వరకు వేసవికి అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు.

రెడ్యాలలో గంగమ్మకు పూజలు

మహబూబాబాద్ రూరల్, మార్చి25 (ఆంధ్రజ్యోతి) : రెడ్యాల గ్రామంలోని బంగారు మైసమ్మ ఆలయం వద్ద టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి-బిందు దంపతులు గంగమ్మకు మంగళవారంరాత్రి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రతియేట బంగారు మైసమ్మ కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వేడుకల్లో గ్రామస్థులు, ఒగ్గు కళాకారులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళాకారులు రమేష్, వెంకటేష్, నరేష్, కిషన్, బాలు, సాయి, కృష్ణ, భాస్కర్, విజయమ్మ, గ్రామస్తులు నూకల వెంకటయ్య, మునలయ్య, సురేందర్‌రెడ్డి, మల్లయ్య, సత్తిరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, సూరయ్య, శ్రీకాంత్, మల్లేష్ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి నవోదయలో సీటు



రేవంత్

గూడూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : చక్రతండాకు చెందిన గిరిజన విద్యార్థి అజ్మీర రేవంత్ నవోదయలో సీటు సాధించాడు. ఇటీవల కాలంలో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష రాశాడు. గత రెండ్రోజుల క్రితం ప్రకటించిన ఫలితాల్లో 100 మార్కులకు గాను 92 మార్కులు సాధించాడు. దీంతో నవోదయ సీటుకు ఎంపికైనట్లు తండ్రి అజ్మీర రాముడు తెలిపాడు.

మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిన బ్రాహ్మణ సంఘం నాయకులు

తొర్రూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పేద బ్రాహ్మణ విద్యార్థుల విదేశీ విద్యకు రూ.100కోట్లు కేటాయించడాన్ని హర్షిస్తూ బ్రాహ్మణ అఫీషియల్స్ ప్రొఫెషనల్స్‌ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, బట్టి విక్రమార్కలను బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా బొప్పా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సుధాకర్ మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకోవాలనుకునే బ్రాహ్మణ విద్యార్థులకు నిధులు కేటాయించడం ఎంతో ఆనందదాయకం అన్నారు. ఈ పథకం ద్వారా బ్రాహ్మణ విద్యార్థులకు గరిష్ఠంగా రూ.20లక్షల వరకు బోధనా రుసుం అందుతుందని తెలిపారు. పేద బ్రాహ్మణులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. నాయకులు రాంప్రసాద్, పీవీ రాంచందర్ రావు, సీతారామయ్య, రాంబాబు, శ్యాం సుందర్, సంతోష్, శ్రీనివాస్ ఉన్నారు.

గిరిజన హక్కుల సాధనకు ఉద్యమించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

తొర్రూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కుల సాధన కోసం ఉద్యమించాలని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం తొర్రూరులో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా గెలిచిన లంబాడ సామాజిక వర్గానికి చెందిన వారికి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29న మానుకోట జిల్లా కేంద్రంలో జరిగే గిరిజన హక్కుల సాధన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి సదస్సుకు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు. లంబాడ హక్కుల పోరాట సమితి మహిళా జిల్లా అధ్యక్షురాలిగా దరావత్ దేవిని ఎంపిక చేసినట్లు తెలిపారు. నాయకులు గిరి నాయక్, శ్రీను, ద్వాలి, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

మరిపెడ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌ఐటీలో సీటు సాధించిన తేజావత్ శ్రీధర్‌కు ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ మంగళవారం ల్యాప్‌టాప్‌ను బహుకరించారు. మరిపెడ మండలం మూలమర్రితండా జీపీకి చెందిన తేజావత్ శ్రీధర్ జేఈఈ మెయిన్స్‌లోఅత్యుత్తమ ర్యాంకు పొంది బీహార్ రాష్ట్రంలోని పాట్నా ఎన్ఐటీ కాలేజీ సీటు సాధించారు. ఆ విద్యార్థిని హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు పిలిచి రాంచంద్రునాయక్ అభినందించారు. ఉన్నత స్థాయికి చేరాలని కాంక్షించారు.



శ్రీధర్‌కు ల్యాప్‌టాప్ అందచేస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్